వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో భక్తజన సందడి


కొలువైన లక్ష్మీనర్సింహస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఏటా మూడు నెలల పాటు ప్రతీ ఆదివారం జాతర నిర్వహిస్తారు. ఆదివారం జాతరకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా హైదరాబాదు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని వంటావార్పు చేసుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానమాచరించి గుట్టపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని కాలినడక వెళ్లి దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.


గంగపట్నం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మల్లన్న జాతర ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లిలో గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు గంగపటం నిర్వహించారు. డోలు వాయిద్యాలతో యాదవ సంఘం సభ్యులు ఊరేగిపుగా స్థానిక చెరువు వద్ద గంగపటం వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 26న మల్లికార్జునస్వామి కల్యాణం, బండ్ల ఊరేగింపు, రాత్రి బోనాల ఊరేగింపు, 27న నాగవెల్లి, బోనాలు, 28 రేణుకా ఎల్లమ్మదేవి కల్యాణం, బోనాలు ఊరేగింపు ఉంటుందని యాదవ సంఘం సభ్యులు తెలిపారు. ఒగ్గు పూజారులు శ్రీశైలం, దేవయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం

రామాయంపేట సీఐ వెంకటేశ్


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్

రామాయంపేట(మెదక్): విద్యార్థికి ఇంటర్ దశ ఎంతో కీలకమని, ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని రామాయంపేట సీఐ వెంకటేశ్ సూచించారు. ఆదివారం స్నేహ జూనియర్ కళాశాలలో విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మంచిగా చదువుకొని తమ తల్లిదండ్రులకు తద్వారా గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సెల్‌ఫోన్లు పక్కన పెట్టి చదువుపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని తెలిపారు. స్నేహ విద్యా సంస్థల చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. తమ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు చాలా మంది నేడు ఉన్నత స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు సమాజ సేవ అవసరమని, పలు గ్రామాల్లో జాతీయ సేవా పథకం కింద పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్‌ఐ రంజిత్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యకలాపాలు ఆకట్టుకున్నాయి.

ఆలయాల్లో భక్తుల సందడి


చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలలు సమర్పించి, వాహనాలకు పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీ నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరువు కాంగ్రెస్ నాయకులు నీలం మధు అమ్మవారిని దర్శించుకున్నారు.

చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

నార్సింగి నుంచి శాలిపేట వరకు రోడ్డు వేయండి


రోడ్డు వేయాలని కోరుతున్న రైతులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రం అభివృద్ధికి ఉపయోగపడే శాలిపేట రహదారిని వెంటనే నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని నార్సింగి రైతులు కోరారు. గతంలో నడకదారి ఉన్నప్పటికీ ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు చొరవచూపలేకపోయారన్నారు. నార్సింగి మండల కేంద్రం నుంచి శాలిపేట వరకు రోడ్డును అభివృద్ధి చేస్తే పరిసర గ్రామాల నుంచి నార్సింగికి రాకపోకలు పెరుగుతాయన్నారు. మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు కూడా దూరం తగ్గనుందన్నారు. మరోవైపు రైతులకు కూడా ప్రయోజనం కలగనుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు శాలిపేట రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలని రైతులు సామిరెడ్డి, కందరి బాల్‌రాజ్, బొమ్మల సిద్ధిరాములు, దొంతి రామచంద్రం కోరారు.

నేడు భూగర్భ వంతెనకు శంకుస్థాపన


రామంతాపూర్ రైల్వేగేట్ వద్ద నిర్మించనున్న భూగర్భ వంతన

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ వద్దనున్న రైల్వేగేట్ వద్ద సోమవారం భూగర్భవంతెన శంకుస్థాపనకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వర్చువల్ విధానంలో భాగంగా సోమవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేసేందుకు సంబంధిత రేల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. భూగర్భ వంతన నిర్మాణం పూర్తి అయితే వెల్దుర్తి - మాసాయిపేట మండలాలకు రాకపోకల ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

శ్రీశైలం వెళ్తున్న శివస్వాములు


ఫైజాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న శివస్వాములు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని ఫైజాబాద్ గ్రామంలోని శివమాల ధరించిన శివస్వాములతో శ్రీశైలం బయలుదేరుతున్నామని గురుస్వాములు రాజు, నవీన్, రవీందర్, యాదాగౌడ్ అన్నారు. ఆదివారం ఇందులో భాగంగా శివ స్వాములు గ్రామంలోని హనుమాన్ మందిరంలోని లింగానికి పూజలు నిర్వహించి, ఆలయ ఆవరణలో ఇరుముడులు ధరించి, గ్రామంలోని ఊరేగించి శ్రీశైలం బయలుదేరామన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, జంగారెడ్డి, శశికాంత్, రమేశ్, రవి, సంపత్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీవిత మార్గం చూపాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: విద్యార్థులకు పుస్తకాలతో పాటు బయటి ప్రపంచాన్ని చూపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని సెయింట్ డాన్ బాస్కో స్కూలు వార్షికోత్సవంలో ఆమె హాజరై మాట్లాడుతూ... విద్యార్థులను పుస్తకాలకే పరిమితం కావొద్దని, వారికి జీవిత మార్గాన్ని చూపాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యతో పాటు ఆటలు అవసరమేనన్నారు. పాఠశాలలు సరస్వతీ నిలయాలని, పిల్లలకు మంచి మార్గాలు చూపే నిలయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి, కరస్పాండెంట్ యశ్వంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన, కౌన్సిలర్ రాంచందర్, బీఆర్‌ఎస్ నాయకులు భిక్షపతి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నంది అవార్డు గ్రహీతకు సన్మానం


బాలకృష్ణాచారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన బూర్గోజు బాలకృష్ణాచారి నంది అవార్డు అందుకోవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. బాలకృష్ణాచారి వందలాది వివాహాలు, గృహ ప్రవేశాలు, వాస్తు తదితర కార్యక్రమాలు చేయడంతో ఇటీవల వరంగల్ ఎన్జీవో భవన్‌లో తెలుగు వెలుగు సాహితీ అకాడమీ జాతీయ కోఆర్డినేటర్లు మోహన్‌రావు, రాజ్‌కుమార్‌చారి చేతుల మీదుగా నంది అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మల్లమారి రవీందర్, బూర్గోజు బాలబ్రహ్మం, మాజీ ఉపసర్పంచ్ వంగ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కుటుంబాల్లో వందలాది వివాహాలు చేశారన్నారు. కార్యక్రమంలో భాస్కర్, మల్లేశం, రాములు, కనకసేనా, నర్సిహారెడ్డి, సుభాష్, ప్రభాకర్, నర్సింహులు పాల్గొన్నారు.

28న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మాచవరం కల్పవన్ వెంచర్ 28న జిల్లా స్థాయి పురుషులు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీలో పాల్గొనే వారు 85 కిలోలకు మించి ఉండకూడదని, అలాగే పాల్గొనే వారు తమ ఒర్జినల్ ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు మార్చి 2, 3, 4 తేదీల్లో నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పల్స్‌పోలియోపై శిక్షణ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పల్స్‌పోలియో విజయవంతం కోసం శిక్షణ ఏర్పాటు చేశామని మెడికల్ ఆఫీసర్ అనిల్‌కుమార్ తెలిపారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని మోడల్‌స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ప్రభుత్వం వచ్చే నెల మార్చి 2 వరకు ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలన్నారు.

బండ్లు, బోనాల ఊరేగింపు

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ అటవీ ప్రాంతంలోని గుట్టపై వెలిసిన గండబేరుండ లక్ష్మీనర్సింహ స్వామి 70వ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలతో పాటు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రాజిరెడ్డి, బీజేపీ నాయకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు అశోక్ గౌడ్, రాజు, బాల నరసయ్య, లక్ష్మీనారాయణ వెంకటయ్య పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు

మన కుటుంబం, సమాజం బాగుండాలి

ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్

రామాయంపేట(మెదక్): మన కుటుంబంతో పాటు సమాజం బాగుండాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన ఉద్దేశమని సంఘం ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ పేర్కొన్నారు. రామాయంపేటలో వివేకానంద ఆవాస విద్యాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ... రామాయంపేటలో 18 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఆవాస విద్యాలయంతో నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సంఘ శాఖల్లో ప్రతీరోజు సమాజం గురించి చర్చిస్తామన్నారు. అయోధ్యలో శ్రీరామ చంద్రుని ఆలయ నిర్మాణంతో నేడు దేశ వ్యాప్తంగా ప్రజలు సంతోషంగా ఉన్నారని, దేశ వ్యాప్తంగా ఆనందకరమైన వాతావరణం నెలకొందన్నారు. రామాయంపేట మాజీ ఎమ్మెల్యే అంతిరెడ్డిగారి విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆవాసంలో చదువుకొన్న విద్యార్థులు మంచి ఉన్నత స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. నార్సింగిలో కూడా త్వరలో ఆవాస విద్యాలయం ప్రారంభమవుతుందని, మాసాయిపేటలో వీహెచ్‌పీ ఆధీనంతో ఉన్న నాలుగున్నర ఎకరాల భూమిలో మంచి విద్యాలయాన్ని ఏర్పాటు చేసే ఆలోచన ఉందని విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆవాస విద్యాలయం వ్యవస్థాపకులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులను తాము విద్యాలయంలో చేర్చుకుంటున్నామన్నారు. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు చదువుతో పాటు దేశభక్తి పెంపొందించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పాఠశాలలతో సమాజానికి ఉపయోగపడే వ్యక్తులు తయారవుతారని పేర్కొన్నారు. తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ మాట్లాడుతూ.. కుల మత బేధం లేకుండా రామాయంపేటలో ఆవాసం కొనసాగడం గొప్ప విషయమన్నారు. సంఘం ప్రతినిధులు పడకంటి సంగమేశ్వర్, లక్ష్మణ్‌యాదవ్, సాంగని యాదగిరి, పండరినాథ్, మల్లారెడ్డి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం


పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యానికి కరాటే, కుంగ్‌ఫూ చాలా అవసరమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నచింతకుంట గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 2024 నేషనల్ ఓపెన్ కుంగ్ ఫూ, కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీలకు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ప్రోగ్రాం కన్వీనర్ పోచయ్య, కరాటే మాస్టర్ పాముల శ్రీనివాస్, వినోద్ కుమార్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు పంబల భిక్షపతి, సత్యం గౌడ్, జగదీష్, మొహమ్మద్, షేక్ హుస్సేన్, పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

చిన్నశంకరంపేట(మెదక్): జూడో చోటకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదారాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన 5వ రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. కరాటే పోటీలలో 25 మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో 8 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. మరో 11 మంది కాంస్యం, 4 రజిత పతకాలు సాధించినట్లు కరాటే కోచ్ కిషన్ తెలిపారు.


పతకాలతో మిర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు

క్లుప్తంగా

చాకలిఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ


చాకలిఐలమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కరీంనగర్ గ్రామంలో ఆదివారం చాకలిఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మహిపాల్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఉద్యమ స్ఫూర్తిగా చాకలి ఐలమ్మ విగ్రహం ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ తానీషా, యాదగిరి, నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కమ్మ ఆలయ వార్షికోత్సవం


చిట్కుల్ అక్కమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులోని అక్కమ్మ తల్లి 26వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాధవానంద సరస్వతీ ఆలయంలోని అక్కమ్మతల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులను ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు గిరిధారి చారి, నర్సింలు, పండరి, రవికుమార్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆహ్వానం


హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని బగలాముఖీ శక్తిపీఠం మొదటి వార్షికోత్సవానికి రావాలని రాష్ట్ర సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న బగలాముఖీ శక్తిపీఠం మొదటి వార్షికోత్సవానికి రావాలని శివ్వంపేట జెడ్పీటీసీ మహేశ్ గుప్తా ఆదివారం హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక హైదరాబాదులో అందజేశారు.

హెల్మెట్ తప్పకుండా ధరించాలి

రేగోడ్(మెదక్): రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అల్లాదుర్గం సీఐ రేణుక తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ.. పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, సంగారెడ్డి వైపు వెళ్లేటప్పుడు నేషనల్ హైవే పై, సర్వీస్ రోడ్లలో రాంగ్ రూట్లో వాహనాలు నడిపి ప్రమాదాలు తెచ్చుకోవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, తమ ప్రాణానికి తానే రక్షణగా ఉండాలని చెప్పారు. నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

మెదక్: మెదక్ నియోజకవర్గంలో సోమవారం ఎమ్మెల్యే రోహిత్‌రావు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు హవేళి ఘణాపూర్ మండలంలోని బూర్గుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తారు. అనంతరం రామాయంపేట మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని దామర చెరువు గ్రామం, దామర చెరువు తండా, దంతెపల్లి తండా, కాట్రియల్‌తండా, బాపనయ్య తండా జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

విజయ సంకల్ప యాత్రకు తరలిన బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): విజయ సంకల్పయాత్రలో భాగంగా తూప్రాన్‌లో జరిగే కార్యక్రమానికి మండల బీజేపీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ.. పార్లమెంట్ నియోజకవర్గాల్లో జరుగుతున్న యాత్రకు తరలినట్లు తెలిపారు.